

## గ్రహణం వేళ.. ఆదిత్యాలయం మూసివేత

అరసవల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7న సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం మూసివేస్తామని ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణానంతరం సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మరుసటిరోజు 8న ఉదయం 7.30 గంటల నుంచి స్వామి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని తెలిపారు.

# ఆశ చూపి.. మోసం చేసి..




● రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన కృష్ణ అనే యువకుడు ఓ బ్యాంకులో పనిచేస్తున్నాడు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి ఇటీవల రూ.11.50 లక్షలు పోగొట్టుకున్నాడు. బంధువులు, స్నేహితులు వద్ద అప్పు చేసి మరీ ఆన్‌లైన్‌లో ఆటలు ఆడాడు. చివరకు మోసపోయానని తెలుసుకొని పోలీసులను ఆశ్రయించాడు.

● శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ యువతికి గరివిడికి చెందిన ఓ బ్యాంకు ఉద్యోగితో ఆరు నెలల కిందట వివాహమైంది. ఉద్యోగరీత్యా వీరు హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. బ్యాంకు ఉద్యోగి.. ఆన్‌లైన్ గేమ్‌లకు, బెట్టింగ్‌లకు అలవాటు పడి తన జీతంతోపాటు భార్య జీతాన్ని కూడా ఈఎంఐలకు ఎండార్స్ చేశారు. ఇంకా ఆన్‌లైన్ గేమ్‌లు ఆడడం ద్వారా మరింత డబ్బు సంపాదించవచ్చునని భార్యకు మరికొంత డబ్బును కన్నవారింటి నుంచి తీసుకొని రావాలని వేధించాడు. ఈ విషయం కన్నవారికి తెలిసి.. ఆమెను శ్రీకాకుళం తీసుకువచ్చేశారు. గత నెలలో శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులకు భర్తపై ఆమె ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఈ నెల 12న ఆ బ్యాంకు ఉద్యోగిపై టూటౌన్ సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

● గత నెలలో హిరమండలం మండలం గులుమూరుకు చెందిన మజ్జి బుజ్జి అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడే అలావాటు ఉన్న బుజ్జి బంధువులు, మిత్రులు వద్ద అప్పులు చేశాడు. అప్పు తీర్చక పోవడంతో వారి నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. బుజ్జి మరణంతో భార్య, కుమారుడు, తల్లిదండ్రులు వీధిన పడ్డారు.





- జిల్లాలో పెరుగుతున్న ఆన్‌లైన్ గేమ్స్ బాధితులు
- రుణయాప్‌లకు ఆకర్షితులై నష్టపోతున్న వైనం
- ఒత్తిడి, వేధింపులు భరించలేక ఆత్మహత్యలు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆన్‌లైన్ గేమ్స్, రుణయాప్‌ల బాధితులు పెరుగుతున్నారు. సెల్‌ఫోన్ ఓపెన్ చేస్తేచాలు.. వన్ ఎక్స్‌బెట్, మెగాపరి, మోస్ట్‌బెట్, పరిపేస, పరిమ్యాచ్, 10సీఆర్‌ఐసి, మెల్‌బెట్, మేట్‌బెట్, 1 ఎక్స్‌బెట్, బీసీ డాట్ గేమ్, 22 బెట్స్, రాజా బెట్స్, స్టేక్ డాట్‌కమ్, డఫ్ఫాబెట్ వంటి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కనిపిస్తుంటాయి. యూట్యూబ్, సోషల్‌మీడియా, పలు వెబ్‌సైట్లలో రూ.వంద పెడితే రూ.వెయ్యి ఇస్తామంటూ బెట్టింగ్ యాప్స్ యాడ్స్ దర్శనమిస్తున్నాయి. చేపకు గాలం వేసినట్టు కొత్త కస్టమర్లకు మొదట్లో రూ.వందకు రూ.200, రూ.వెయ్యికు, రూ.రెండువేలు, రూ.మూడువేలు ఇస్తూ మెల్లగా ఊబిలోకి లాగుతున్నారు. ప్రస్తుతం యువత పగలు, రాత్రీ తేడా లేకుండా ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌లో మునిగి తేలుతున్నారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, బ్యాంకర్లు సైతం ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతున్నారు. చాలామంది ఈ బెట్టింగ్‌ల్లో నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారు.

### రుణాల పేరిట అలా ఉచ్చులో...

ఆన్‌లైన్‌లో రుణాలు ఇస్తామంటూ సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఎటువంటి డాక్యుమెంట్లు, ష్యూరిటీలు లేకుండానే.. యాప్ ద్వారా క్షణాల్లో మీ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ఆశ పెడుతున్నారు. సాధారణ, మధ్యతరగతి ప్రజలు అవసరాల కోసం వీటి ఉచ్చులో పడుతున్నారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత వారికి రుణాల మంజూరు చేస్తూ.. ఫోన్‌లో కాంటాక్ట్ నెంబర్ల డేటా సైతం సేకరిస్తున్నారు. కాగా.. రుణం ఇచ్చిన వారం, పది రోజుల వ్యవధికే అధిక వడ్డీ కట్టాలంటూ మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు. రూ.7వేలు తీసుకున్న వ్యక్తికి (మిగతా 6వ పేజీలో..)

## జీడి రైతుల ఆర్థికాభివృద్ధికి పూర్తి సహకారం

- 75శాతం సబ్సిడీపై కోల్డ్‌స్టోరేజీ యూనిట్లు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జీడిరైతుల ఆర్థిక అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ భరోసా ఇచ్చారు. పలాస ప్రాంత జీడిపప్పు.. కేంద్ర ప్రభుత్వ వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ పథకం క్రింద ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో రైతులు, కొనుగోలుదారులు, ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లాలో జీడి రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. సులభ రుణ సదుపాయాలు కల్పించాలి. డీఆర్డీఏ ద్వారా సబ్సిడీ, ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రాసెసింగ్ యూనిట్లకు విద్యుత్ శాఖతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి. ముఖ్యంగా 20కిలోవాట్ల లోడ్ కంటే తక్కువ ఉన్న యూనిట్లకు ట్రాన్స్‌ఫార్మర్ అవసరం లేకుండా సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి. జీడిపప్పు బైప్రోడక్ట్స్‌ను ఉపయోగించి రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా చూడాలి. ప్రాసెసింగ్ యూనిట్లు బలోపేతం కావాలి. దళారీ (మిగతా 6వ పేజీలో..)

## ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

- విజయనగరంలో పట్టాలు తప్పిన గూడ్స్
- వివిధ పాసింజర్ ట్రైన్లు రద్దు

పలాస/ ఇచ్ఛాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో.. జిల్లా మీదుగా పలు రైళ్ల రాక పోకలు ఆలస్యంగా సాగుతున్నాయి. వివిధ పాసింజర్ రైళ్లను రద్దు చేసినట్టు ఈస్ట్‌కోస్ట్‌రైల్వే అధికారులు ప్రకటించారు. శుక్రవారం ఉదయం 6.30గంటల సమయంలో విజయనగరం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం దాటిన వెంటనే రైల్వేబ్రిడ్జి సమీపంలో నాగపూర్ నుంచి కాకినాడ పోర్టుకు బియ్యం లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు (మిగతా 6వ పేజీలో..)


పలాస రైల్వేస్టేషన్‌లో నిలిచిన వందేభారత్ రైలు

## కరకట్టలు నిర్మించేదెప్పుడు?

- వరదొస్తే ఏటా పంట పొలాలు ముంపు
- ఆందోళనలో నదీ పరీవాహక ప్రాంత రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


బూరవిల్లి వద్ద నదీ పరీవాహకంలో కోతకు గురవుతున్న పొలాలు

గార రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గార మండలంలో వంశధార పరీవాహక ప్రాంతాలు ఏటా వర్షాకాలంలో వరదలకు ముంపునకు గురవుతూనే ఉన్నాయి. పంట పొలాలు కూడా నీట మునిగిపోతున్నాయి. నదికి ఆనుకుని ఉన్న పొలాలు కోతకు గురై.. నదీగర్భంలో కలిసిపోతున్నాయి. మండలంలోని బూరవిల్లి, అంబళ్లవలస, పూసర్లపాడు, శాలిహుండం, బోరవానిపేట, గార, వమరవల్లి, కళింగపట్నం తదితర గ్రామాల్లో వేలాది ఎకరాలు నదీగర్భంలో కలిసిపోయాయి. ఇటీవల వర్షాలకు కూడా వరిపంట నీటమునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కరకట్టలు నిర్మించాలని ఆయా ప్రాంతాల రైతులు, ప్రజలు 20 ఏళ్లుగా అధికారులకు, పాలకులకు మొర పెట్టుకున్నా పట్టించుకునే దాఖలాలు లేవు.

2008లో అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద రావు చొరవతో.. వంశధార, నాగావళి నదులకు ఇరువైపులా కరకట్టలు నిర్మించాలని నిర్ణయించారు. అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి రూ.310 కోట్లు నిధులు కేటాయించగా రెండు నదులకు ఇరువైపులా కరకట్టల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అప్పట్లో వంశధార నదికి సంబంధించి హిరమండలం గొట్టాబ్యారేజీ నుంచి కళింగపట్నం వరకు, పోలాకి మండలం పల్లిపేట వరకు నదీ పరీవాహక ప్రాంతంలో భూసర్వే చేశారు. కొంతమేరకు ప్రభుత్వ భూమి ఉండగా, మరికొంత భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి అధి కారులు సేకరించారు. బాధిత రైతులకు కొంత మేర నష్టపరిహారం చెల్లించారు. సీఎం రాజశేఖర్‌రెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందడం.. తర్వాత నాయకులెవరూ పట్టించుకోకపోవడంతో కరకట్టల నిర్మాణం కార్యరూపం దాల్చలేదు.

2014లో టీడీపీ అధికారంలోకి రాగా.. మళ్లీ కరకట్ట నిర్మాణ వ్యవహారం తెర మీదకు వచ్చింది. నదీ పరివాహక ప్రాంత ప్రజల గోడు, పాలకుల ఒత్తిడి మేరకు అధికారులు నివేదిక తయారు చేశారు. కాగా అక్కడక్కడా గట్టును పోల్చడం (మిగతా 6వ పేజీలో..)


వమరవల్లి వద్ద ముంపునకు గురయ్యే పంట పొలాలు

### ● వరద అంటే భయమే..



వంశధార నదికి వరద వస్తుందని తెలిస్తే చాలు.. భయం వేస్తుంది. ప్రతీ ఏడాది వరద నీటి ఉధృతికి పంటపొలాలు మునిగి పోయి గ్రామాల్లోకి నీరు ప్రవేశిస్తుంది. దీంతో చాలా వరకు ఆస్తినష్టం జరుగుతోంది. భూమిలిచ్చిన రైతులకు నష్ట పరిహారం చెల్లించినా.. కరకట్టల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆంత్యరమేమిటో అర్థం కావడం లేదు.

- తంగుడు రమణ, బూరవిల్లి

### ● నదీ గర్భంలో వంద ఎకరాలు..



ఏటా వర్షాకాలంలో సంభవించిన తుఫాన్‌లకు ప్రాజెక్టు నుంచి దిగువ ప్రాంతానికి వరదనీరు ఎక్కువగా అధికారులు విడిచిపెడుతుంటారు. దీంతో నదీ పరివాహక ప్రాంతంలో పంట పొలాలు కోతకు గురై నదీగర్భంలో కలిసిపోతున్నాయి. నా చిన్నతనం నుంచి చూస్తున్నాను మా పంచాయతీకి సంబంధించి సుమారు వంద ఎకరాల వరకు నదీగర్భంలో కలిసిపోయాయి.

- కల్లి రామిరెడ్డి, ఎస్.డి.ఎన్.పేట

## కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

- ఇంకా ఏడుగురు డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాలు పెండింగ్


ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన డీఎస్సీ అభ్యర్థులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం కూడా కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 543 మంది అభ్యర్థులకుగానూ శ్రీకాకుళం మహాలక్ష్మినగర్‌లో సమగ్రశిక్ష ఎఫ్.ఎల్.ఎన్ శిక్షణ కార్యాలయంలో గురువారం 403 మంది ధ్రువపత్రాలను పరిశీలించారు. అందులో 13 మంది సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదు. దీంతో వారికి శుక్రవారం అవకాశం కల్పించారు. వారితో మిగిలిన 140 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను కూడా అధికారులు పరిశీలించారు. కాగా.. శుక్రవారం ఏడుగురు అభ్యర్థులు సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదు. దీంతో అధికారులు వారికి మరో అవకాశం కల్పిస్తూ శనివారం ధ్రువపత్రాలు పరిశీలించనున్నారు. ముందుగా అభ్యర్థులు అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలను సమర్పిస్తే.. వాటిని పరిశీలించి, వారిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. సిబ్బంది సహకారంతో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని డీఈవో రవిబాబు తెలిపారు.

ఇచ్ఛాపురంలో అడ్మిషన్లు ఫుల్
● ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పెరిగిన విద్యార్థులు
జిల్లాకు రావడం ఆనందంగా ఉంది
● విలక్షణ నటుడు సత్యరాజు
పెరటిసాగుకు ప్రోత్సాహం
● పొదుపు సంఘాల మహిళలకు సబ్సిడీపై కూరగాయల విత్తనాలు
6 లో

## పరిశోధనా ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో పరిశోధనకు పీహెచ్‌డీలో ఏడు సీట్ల భర్తీకి శుక్రవారం వర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహించారు. బయోటెక్నాలజీ, సోషల్‌వర్క్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ సబ్జెక్ట్‌ల్లో పరిశోధనకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. వర్సిటీ అకడమిక్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని, రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం.అనూరాధ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు.

## సెప్టెంబరు 19 నుంచి ఎంపీ కప్

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సిక్కోలు క్రీడాకారులకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు శుభవార్తను అందించారు. ఎర్రన్న క్రీడా ఉత్సవంలో భాగంగా ఎంపీ కప్-2025ను సెప్టెంబరు 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నా తండ్రి.. దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడుకు క్రీడలంటే మక్కువ. జిల్లా యువతలోని క్రీడా సామర్థ్యాలను బయటకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఎంపీ కప్ క్రీడా ఉత్సవ్ నిర్వహించనున్నాం. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఏడు పెంకులాట, కర్రసాము, చదరంగం, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్ వంటి ప్రధాన ఎనిమిది సంప్రదాయ క్రీడా పోటీలు జరుగుతాయి. ఆసక్తిగల క్రీడాకారులు వీపీఎస్ శ్రీకాకుళం.లైవ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి. అధిక సంఖ్య క్రీడాకారులు పాల్గొని.. క్రీడల్లో సిక్కోలు ప్రతిభ ప్రపంచానికి చాటిచెప్పాల'ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. ఈ పోటీల ద్వారా యువతలో ఫిట్‌నెస్, క్రీడాస్ఫూర్తి, ప్రతిభ మరింత పెంపొందుతుందని ఆకాంక్షించారు.

## విజయగణపతికి శత కలశాభిషేకం


విజయగణపతికి ప్రత్యేక అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీకాకుళంలోని విజయగణపతి ఆలయం(పాలకొండ రోడ్డు)లో శత కలశాభిషేకం పూజలు నిర్వహించారు. వినాయకుడిని గరికతో, పూలతో అలంకరించగా.. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. 108 మంది గణపతి మాలాధారణతో పూజలు చేశారు. అలాగే వరంవీధిలో జగన్నాథస్వామి అవతారంలో ఉన్న వినాయకుడ్ని భక్తులు దర్శించుకున్నారు.


శ్రీకాకుళం వరం వీధిలో జగన్నాథస్వామి అవతారంలో వినాయకుడు

## ఇచ్ఛాపురంలో
# అడ్మిషన్లు ఫుల్

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పెరిగిన విద్యార్థులు
- ఎండీఎం ప్రధాన కారణం
- రెండు కాలేజీల్లో విద్యార్థులు 680



ఇచ్ఛాపురంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

ఇచ్ఛాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్ల లక్ష్యాలను చేరుకున్నాయి. జిల్లాలోని కాలేజీల్లో విద్యార్థుల చేరికలు తగ్గినప్పటికీ ఇచ్ఛాపురం బాలురు, బాలికల జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్య లో చేశారు. దీనికి ప్రధానంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం పథకంతో పాటు కళాశాలల్లో మౌలిక వసతులు కూడా ఓ కారణంగా చెబు తున్నారు. బాలికల జూనియర్ కాలేజీలో 430 మంది విద్యార్థినులున్నారు. బాలుర జూనియర్ కాలేజీలో 145 ఉండగా ఈ ఏడాది మరో 105 చేరికలు జరగడంతో ప్రస్తుతం 250కి చేరాయి. 250 స్ట్రెంత్ ఉంది. దీంతో రెండు కళాశాలల్లో 780 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇది ఒక రికార్డే. అయితే కూటమి ప్రభుత్వం తీసుకున్న సానుకూల నిర్ణయాలతోనే ఇది సాధ్యమైందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**అవగాహన లేక..**

జిల్లాలో ప్రభుత్వం ఆధ్వర్యంలో 48 జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, 10 ప్లస్ పాఠశాలలు ఉన్నా విద్యార్థుల తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడం, తగినంతమంది బోధకులు, వసతులు లేకపోవడంతో ఎక్కువ మంది ప్రైవేటు కళాశాలలవైపు మొగ్గు చూపు తున్నారు. తమ పిల్లాడు చదువు పరంగా వెనుకబడిపోతాడన్న ఆందోళన సగటు తల్లిదండ్రుల్లో ఉంది. దీనినే ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు క్యాష్ చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సంస్థల్లో సీట్లు ఖాళీగా ఉంటుండగా ప్రైవేటు కళాశాలల్లో సీట్లు ఫుల్అవుతున్నాయి. కానీ ఈ ఏడాది కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుండడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువగా ప్రభుత్వ కళాశాలల్లో చేరుతున్నారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఇదే ఓ కారణం. పైగా సమీపంలోని ఒడిశా ప్రాంతలో జూనియర్ కాలేజీలు అందుబాటులో లేవు. అందుకే అక్కడి విద్యార్థులు సైతం చేరుతుండడంతో రికార్డు స్థాయిలో అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. జిల్లాలో ఈ ఏడాది 22,219 మంది విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. కానీ జిల్లా వ్యాప్తంగా ఉన్న 186 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చేరిన విద్యార్థులు కేవలం 18,500 మాత్రమే. మిగతా వారిలో కొందరు ఐటీఐ, మరికొందరు పాలిటెక్నిక్ డిప్లమో, ఇంకొందరు సాంకేతిక విద్య కోసం ఇతర జిల్లాలకు వెళ్లిపోయినట్టు తెలుస్తోంది.

**చేరికలు పెరిగాయి..**

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరికలు పెరిగాయి. అటు మహిళా కాలేజీలో సైతం రికార్డుస్థాయిలో విద్యార్థినులు చేరారు. ఉత్తమ విద్యాబోధనతో పాటు మధ్యాహ్నభోజన పథకం అమలులో ఉంది. విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందుతోంది. అందుకే విద్యార్థుల చేరిక పెరిగింది.

**-శరత్‌బాబు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఇచ్ఛాపురం**


డ్వాక్రా సంఘాలకు పంపిణీ చేసిన పెరటిసాగు కూరగాయల విత్తనాల ప్యాకెట్లు

# పెరటిసాగుకు ప్రోత్సాహం

- పొదుపు సంఘాల మహిళలకు కూరగాయల విత్తనాలు
- రూ.200 ప్యాకెట్‌ను సబ్సిడీపై రూ.65కే ప్రభుత్వం అందజేత

నరసన్నపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రోత్సాహం ఇస్తోంది. పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా పొదుపు సంఘాల మహిళలకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేస్తోంది. పెరటిపంటల సాగు ఆరోగ్యానికి సోపానం అని మహిళలను చైతన్యపరస్తూ తక్కువ ధరకు కూరగాయల విత్తనాలను అందజేస్తోంది. రెండు వందల రూపాయిల విలువైన ప్యాకెట్‌ను రూ.65కే ఇస్తోంది. ఇప్పటికే అన్ని మండలాలకు వాటిని సరఫరా చేసింది.

- జిల్లాలో దాదాపు 45వేల సంఘాలకు వీటిని అందజేసేందుకు సెర్ప్ ఆధ్వర్యంలో ఒక సీడ్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. వాటిని తక్కువ ధరతో మహిళలు తీసుకుని తమకు అందుబాటులో ఉన్న పెరటిలో చల్లుకోవాలి. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేయాలి. ఈ ప్యాకెట్లులో తోటకూర, పాలకూర, గోంగూర వంటి ఆకుకూరల విత్తనాలతో పాటు బెండ, బీర, అనాప, కాకర, గోరుచిక్కుడు, పందరి చిక్కుడు, టమాట, మునగకాయ విత్తనాలు ఉన్నాయి. వీటిని మహిళలు వినియోగించి ప్రభుత్వ లక్ష్యం మేరకు పంటలు పండిస్తే మంచి ఆరోగ్యానికి సోపానమేనని పలువురు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న నటుడు సత్యరాజు

# జిల్లాకు రావడం ఆనందంగా ఉంది

- విలక్షణ నటుడు సత్యరాజు
- కీర్తిక థియేటర్‌లో త్రిబాణధారి బార్బరిక్ యూనిట్ సందడి

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాషలో 1990వ దశకంలో ఆరాధన సినిమా శ్రీకాకుళం జిల్లాలో తీశారని, ఆ షూటింగ్‌లో తాను పాల్గొన్నానని, మళ్లీ ఇప్పుడు త్రిబాణధారి బార్బరిక్ చిత్రం విజయోత్సవ సభకు రావడం ఆనందంగా ఉందని విలక్షణ నటుడు సత్యరాజ్ అన్నారు. త్రిబాణధారి బార్బరిక్ విజయోత్సవ సభ స్థానిక కీర్తిక థియేటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు సత్యం రాజేష్, దర్శకుడు మోహన్ శ్రీవాస్తవతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యరాజ్ మాట్లాడుతూ.. కుటుంబ సమేతం గా చూడాల్సిన సినిమా త్రిబాణధారి బార్బరిక్ అని అన్నారు. డైరెక్టర్ మోహన్ శ్రీవాస్తవ్ మాట్లాడుతూ.. తాను పోలాకి మండలం సుసరాం గ్రామానికి చెందిన వ్యక్తిని అని, శ్రీకాకుళం కళలకు అడ్డా అని తెలిపారు. పవన్ కల్యాణ్ నటించిన ఖుషీ చిత్రం రిలీజ్‌రోజు ఉదయం 6 గంటలకు కిన్నెర కాంప్లెక్స్ క్యూలైన్‌లో వేచి ఉండి సినిమా చూశానన్నారు. 71 ఏళ్ల సత్యరాజు వంటి నటుడి వద్ద నేర్చుకోవాల్సింది చాలా ఉందని, ఆ వయసులో కూడా సత్యరాజ్ అర్ధరాత్రి మూడు గంటలకు పిలిస్తే షూటింగ్‌లో పాల్గొనేవారన్నారు. ఎందరో కళాకారులను జిల్లా ఆదరించిందని, తనను కూడా ఆదరించాలని కోరారు. నటుడు సత్యం రాజేష్ మాట్లాడుతూ.. తాను ఎన్నో సినిమాల్లో నటించానని, శ్రీకాకుళంలో అనేక చిత్రాల విజయోత్సవ సభల్లో పాల్గొన్నానని, డైరెక్టర్ మోహన్ శ్రీవాస్తవ్ మంచి నైపుణ్యం ఉన్న దర్శకుడు అని అన్నారు. శ్రీవాస్తవ్ పెద్ద నటులతో సినిమాలకు దర్శకత్వం వహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. కార్యక్రమంలో చిత్రం టెక్నికల్ మేనేజర్ సురేష్, థియేటర్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## ఆశ చూపి.. మోసం చేసి..

(ఐదో పేజీ తరువాయి)

కేవలం 15 రోజుల్లోనే రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. రుణం చెల్లించడం ఆలస్యమైతే రెండింతల వడ్డీ ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. కొంతమంది అంత వడ్డీ చెల్లించకపోవడంతో వారి ఫోన్‌లో ఉన్న కాంట్రాక్ట్ నెంబర్లకు ఫోన్‌లు, మెసేజ్‌లు పంపిస్తూ భయపెడుతున్నారు. దుష్ప్రచారం చేస్తూ వేధిస్తున్నారు. దీంతో ఒత్తిడి, వేధింపులు తట్టుకోలేక మానసికంగా కృంగిపోయి కొందరు ఆత్మహత్య చేసుకున్న ఘటనలూ జిల్లాలో ఉన్నాయి. యువత, ఉద్యోగులు ఆన్‌లైన్ గేమ్స్, రుణాల బారిన పడకుండా పోలీసులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ గేమ్‌ల నియంత్రణపై కఠినచర్యలు చేపడుతూ ఇటీవల పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేందుకు బిల్లు ప్రతిపాదించారు. చట్టాలు అమలైతే ఆన్‌లైన్ గేమ్‌లో ఎంతవరకు నియంత్రించ వచ్చునని వేచి చూడాలి.

**చాలా జాగ్రత్తగా ఉండాలి..**

ఆన్‌లైన్ గేమ్స్, రుణ యాప్‌లతో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేనిపోని లింకులు క్లిక్ చేయకూడదు. ఒకసారి అటువంటివి క్లిక్ చేస్తే అదేపనిగా సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వస్తుంటాయి. రుణాల పేరుతో ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంది. ఎవరికైనా ఆర్థిక సమస్యలుంటే కుటుంబ సభ్యులు, స్నేహితుల ద్వారా పరిష్కరించుకోవాలే కానీ రుణయాప్‌లను సం ప్రదించకూడదు.

**-వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళంటౌన్**


ప్రకృతి చిత్రం

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువలు పొంగి, పొలాలను ముంచెత్తాయి. నీటి అడుగున మునిగిన చేలతో పచ్చని పొలాలు చెరువును తలపించాయి. అయితే అదే విచిత్రం. శుక్రవారం వర్షం పూర్తిగా వెలసిన అనంతరం మునిగిన పంట పొలాలపై నీలి మబ్బుల నీడలు ప్రతిబింబించి, అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరించాయి. ఈ అందం మాటున దాగి ఉన్న రైతుల కష్టం, కన్నీళ్లు కరిగిపోయాయి. అందం, ఆవేదన రెండూ ఒకే చిత్రంలో ఆవిష్కృత మయ్యాయి. ఈ చిత్రం పెద్దపాడు నుంచి వాడాడకు వెళ్లే మార్గంలో శుక్రవారం ఆవిష్కృతమైంది.

**-అరసవల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి)**

## కరకట్టలు నిర్మించేదెప్పుడు?

(ఐదో పేజీ తరువాయి)

హద్దులు నిర్ణయించడం తప్ప పూర్తి స్థాయిలో పనులు ఎక్కడా జరగలేదు. కొన్ని ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా వేతన దారులతో గట్టు నిర్మాణానికి రూపకల్పన చేశారు.

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కరకట్టల నిర్మాణాన్ని కనీసం పట్టించుకోలేదు. ఎక్కడా తట్టెడు మట్టి వేసిన దాఖలాలు లేవు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా స్పందించి కరకట్టల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## జీడి రైతుల ఆర్థికాభివృద్ధికి పూర్తి సహకారం

(ఐదో పేజీ తరువాయి)

వ్యవస్థ లేకుండా చూడాల'ని ఆదేశించారు. విలువ ఆధారిత ఉత్పత్తులు పెరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులు ఎఫ్‌పీవోగా ఏర్పడి ముందుకు వస్తే 75శాతం సబ్సిడీపై కోల్డ్‌స్టోరేజీ యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. ఉద్యానశాఖ అధికారి ఆర్‌వివి.ప్రసాదరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, పరిశ్రమల జీఎం శ్రీధర్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావు, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, కార్మికశాఖ ఉప కమిషనర్ కె.దినేష్‌కుమార్, ఏపీఈపీడీసీఎల్, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు, జీడిరైతులు, బయ్యర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల సభ్యులు పాల్గొన్నారు.

## విశాఖ రేంజ్‌లో పలువురు సీఐల బదిలీ

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉంటూ పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సీఐలకు పోలీసు స్టేషన్లు కేటాయిస్తూ డీఐజీ గోపీనాథ్ జట్టి ప్రొసీడింగ్స్ జారీచేశారు. ఇంకా పలువురు సీఐలకు స్థానచలనం కలిగించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఆర్.నీలయ్యను పార్వతీపురం మన్యం జిల్లాకు, ఆర్.సత్యనారాయణరెడ్డిను విజయనగరం జిల్లాకు, లెంక భాస్కరరావును శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. బి.రమణమూర్తిని పార్వతీపురం మన్యం జిల్లా డీఎస్ఆర్‌బీకి, ఎం.చంద్రశేఖర్‌ను విజయనగరం జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు, ఇక్కడ పనిచేస్తున్న డి.బంగారుపాపను విశాఖ రేంజ్‌కు బదిలీ చేశారు. విజయనగరం జిల్లా వీఆర్‌లో ఉన్న బీవీ వెంకటేశ్వరరావును విశాఖ రేంజ్‌కు, విశాఖ రేంజ్‌లో ఉన్న ఎస్.రమేశ్‌ను విశాఖలోని సీపీఎస్‌పీకి, పార్వతీపురం మన్యం జిల్లాలో డీఎస్ఆర్‌బీలో ఉన్న పి.రంగనాథంను అదే జిల్లా రూరల్‌కు బదిలీచేసి అక్కడ ఉన్న ఎస్.గోవిందరావును రేంజ్ వీఆర్‌కు అటాచ్ చేశారు. విజయనగరం జిల్లా సోషల్ మీడియా సైబర్‌సెల్‌లో పనిచేస్తున్న బమ్మిడి శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు సీఐగా బదిలీచేసి, అక్కడ పనిచేస్తున్న పి.వెంకటరమణను అల్లూరి జిల్లా సోషల్ మీడియా సైబర్‌సెల్‌కు బదిలీ చేశారు.

## ఆలస్యంగా రైళ్ల రాకపోకలు


ఇచ్ఛాపురం: రైల్వేస్టేషన్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

(ఐదో పేజీ తరువాయి)

పట్టాలు తప్పింది. ఐదు వ్యాగన్‌లు పట్టాలు తప్పగా, రెండు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మూడు వ్యాగన్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో రైల్వే విద్యుత్ లైనుతో పాటు ఆ గూడ్స్ ప్రయాణిస్తున్న ట్రాక్ దెబ్బతింది. దీంతో పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలాస రైల్వే స్టేషన్‌లో 20841 వందేభారత్ రైలును మూడు గంటలపాటు నిలిపేశారు. 12863 హౌరా-యశ్వంత్ పూర్ నాలుగు గంటలపాటు నిలిచిపోయింది. బరంపూర్-విశాఖ పాసింజర్ రైలును పూర్తిగా రద్దు చేసారు. 18463 ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, 18047 వాస్కోడిగామ, 22644 పాట్నా-యర్నాకులం, 18117 రాజారాణి, 12839 హౌరామెయిల్, 22819 ఇంటర్‌సిటీ, 17017 భువనేశ్వర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 3 నుంచి ఐదు గంటలపాటు ఆలస్యంగా వెళ్లాయి. అనేక రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

- ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లోనూ ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. శుక్రవారం ఉదయం హౌరా నుంచి మద్రాస్ వెళ్లే రైలు ఉదయం 8.53 గంటలకు రావాల్సి ఉండగా, ఏడు గంటలపాటు ఆలస్యమైంది. మధ్యాహ్నం 3.23 గంటలకు స్టేషన్‌కు చేరుకుంది. అలాగే భువనేశ్వర్- హైదరాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ 11.30గం.. లకు రావల్సి ఉండగా, 4.30 గంటలు ఆలస్యమైంది. సాయంత్రం 4గంటలకు వచ్చింది. ఉదయం 10గంటలకు, 10.30గంటలకు రావాల్సిన బరంపురం-విశాఖ, భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.


చేపల పెంపకానికి సంబంధించిన సమాచారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జి.సిగడాం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం నిద్దాంలో సిద్ధివినాయక స్వయం శక్తి సంఘం సభ్యురాలు పైల కోటేశ్వరమ్మ నిర్వహిస్తున్న సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్ (సీఎస్ఏ) కొరమీను చేపల పెంపకం ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలని కోరారు. చేపల పెంపకానికి వినియోగించే నీటిని కూరగాయల పెంపకం, వరి, ఇతర పంటలకు వాడటం వల్ల యూరియా తక్కువ మోతాదులో అందించవచ్చన్నారు. ఈ నీరు వల్ల భూసారం కూడా పెరుగుతుందన్నారు. ఎచ్చెర్ల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఫిషరీస్ వీవోఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల తనిఖీ

- 29 కేసులు నమోదు
- రూ 52,600 జరిమానా

పాత శ్రీకాకుళం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై రవాణా శాఖాధికారులు శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం నగర పరిధిలో సింహద్వారం సమీపంలో హైవేపై ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 29 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.52,600 జరిమానా విధించినట్లు ఉప రవాణా కమిషనర్ ఎ.విజయ్ సారధి తెలిపారు. మంటలను ఆర్పే పరికరాలు లేకపోవడం, డ్రైవర్లు యూనిఫాం ధరించకపోవడం, ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేకపోవడం, వాహనాల్లో డాంజిలింగ్ లైట్లు, అదనపు సామాన్లు వేయడం వంటి చర్యలుపై నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల భద్రత, ప్రయాణికుల సౌకర్యం దృష్ట్యా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.



మౌలిక వసతులు లేని తెంబూరు రైల్వేస్టేషన్

# రైల్వేస్టేషన్‌లో వసతుల్లేవ్

పాతపట్నం రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా నౌపడా నుంచి గుణుపూర్ వెళ్లే రైలు మార్గంలో ప్రయాణికులకు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రౌర్కెలా నుంచి గుణుపూర్ వరకు రాజారాణి ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తుండగా, విశాఖ నుంచి గుణుపూర్ రైలు ప్రతిరోజూ నడుస్తున్నాయి. ఈ మార్గంలో తెంబూరు, గంగువాడ, పాతపట్నం రైల్వేస్టేషన్లు ఉన్నాయి. అయితే ఆయా స్టేషన్లలో కనీసం కూర్చోవడానికి కూడా సరైన వసతుల్లేవు. నిల్చుందామన్నా నీడ కూడా కనిపించదు. వర్షం వస్తే ప్లాట్‌ఫారంపై నిలబడే పరిస్థితి కూడా ఉండదు. రైలు వచ్చినప్పుడు వర్షానికి తడుస్తూ ఎక్కాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. తెంబూరు రైల్వేస్టేషన్ వద్ద అయితే తాగడానికి కూడా మంచినీరు లేదు.


తెంబూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం ఇలా..

# ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మానవహారం, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



సంతబొమ్మాళి: దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన



ఇచ్ఛాపురం: ఈదుపురం కంద్ర ఒడియా పాఠశాలలో హాకీ, ఇండియా ఆకారంలో విద్యార్థులు


కవిటి: క్రీడాకారులను సత్కరిస్తున్న ఉషోదయ యువజన సంఘ సభ్యులు



జి.సిగడాం: స్పోర్ట్స్ డే అక్షర ఆకారంలో కేజీబీవీ విద్యార్థినులు


పోలాకి: ఈదులవలస మోడల్‌స్కూల్ విద్యార్థుల పిరమిడ్ ప్రదర్శన


నరసన్నపేట: సత్య వరం పాఠశాలలో పిరమిడ్ ప్రదర్శన


హిరమండలం: గులుమూరు పాఠశాలలో హాకీ క్రీడా సింబల్ ఆకారంలో విద్యార్థులు


పలాస: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలో పాల్గొన్న విద్యార్థులు

## సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు


ప్రజాదర్బార్‌లో వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు విశాఖ-ఎ కాలనీలోని తన కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులతో తక్షణమే మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి సుపరిపాలన అందిస్తోందన్నారు.

## రిక్కా రాముడుకు తెలుగు పురస్కారం


రిక్కా రాముడిని సత్కరిస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ తదితరులు

గార రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గార మండలం గొర్లెవానిపేటకు చెందిన రిక్కా రాముడుకు తెలుగు భాషా పురస్కారం లభించింది. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ నిర్వహించిన కవితల పోటీలో రిక్కా రాముడు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి ఆయనకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. ప్రతి ఏటా ఆన్‌లైన్‌లో 20 రంగాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో సాహిత్య విభాగంలో ఎంపికైన ముగ్గురిలో రిక్కా రాముడు ఒకరు. ఈ సందర్భంగా రాములును గ్రామస్థులు అభినందించారు.

## కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మేలు

శ్రీకాకుళం లీగల్ ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి మధ్య వర్తిత్వం మేలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఎక్కువ కేసులు కోర్టుల్లో కాకుండా మధ్యవర్తిత్వం ద్వారానే పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. మధ్యవర్తిత్వ న్యాయవాదులు కక్షిదారుల కు అనుకూలంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు పాల్గొన్నారు

## కార్మికశాఖ ఆధ్వర్యంలో దుకాణాల తనిఖీ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రకారం ఆన్‌లైన్ వచ్చిన ఫిర్యాదుల మేరకు నగరంలోని దుకాణాలు, సంస్థలపై శుక్రవారం కార్మిక శాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు కార్మికులకు కనీస వేతనం చెల్లించడం లేదని గుర్తించారు. సంబంధిత యజమానుల నుంచి రూ. 45,514 వేతనం తేడా ఉందని లెక్కించి, డీడీల రూపంలో వసూలు చేసి సంబంధిత కార్మికులకు అందజేసినట్లు ఉప కమిషనర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు

## ప్రతిభ చూపిన పాఠశాలలకు క్రీడా పురస్కారాలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని క్రీడా విభాగంలో అత్యధిక పాయింట్లు సాధించిన పాఠశాలలకు పురస్కారాలకు ఎంపిక చేసినట్లు డీఈవో ఎ.రవిబాబు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, ఉప విద్యాశాఖాధికారులు విజయకుమారి, విలియమ్స్‌లు తెలిపారు. శాస్త్రులపేట ఎంజే పీఏపీ పాఠశాల, అల్లినగరం, ఇప్పిలి, పాత్రునివలస, కేశవరావు జడ్పీ హైస్కూళ్ల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ పురస్కారాలను అందజేశారు.


క్రీడా పురస్కారాలు అందుకున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

## జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

సరుబుజ్జిలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి గ్రామంలో శుక్రవారం పీహెచ్‌సీ సిబ్బంది మలేరియా తదితర జ్వరాలపై అప్రమ త్తంగా ఉండాలని కోరారు. నామాల గోవింద రావుకు మలేరియా నిర్ధారణ కావడంతో జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.సూర్యం ఆధ్వర్యంలో వైద్యులు గ్రామంలో పర్యటించారు. వైద్యాధికారి ఎస్.సాహితీ ప్రియదర్శిని, సీ హెచ్‌వో కె.మోహన్ రావు మలేరియా జ్వరబాధితుడు గోవిందరావుకు వైద్య సేవలు అందించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి ప్రజలకు చైతన్యం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎండ రామారావు, చందనాల అప్పారావు, గోపాలరావు పాల్గొన్నారు.

## ఎరువులు అందక రైతుల ఇక్కట్లు

ఇచ్ఛాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎరువులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అయితే టీడీపీ నాయకులు పట్టించుకోకపోవడం దారుణమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పిన నేతలు ప్రస్తుతం కనీసం ఎరువులు అందించడంలో విఫలమయ్యారన్నారు. వారికి ఎరువులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

గార రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల అవసరం మేరకు యూరియాను సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం విఫలమయ్యాయని ఎంపీపీ గొండు రఘురాం అన్నారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు

శ్రీకాకుళం స్పోర్ట్స్ ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్స్ ఉమెన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు శుక్రవారం పయనమైంది. శని, ఆదివారాల్లో గుం టూరు జిల్లాలో జగరనున్న రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్, కార్యదర్శి సూర శ్రీనివాస రావు, ఎంవీ రమణలు ఆకాంక్షించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులకొల్లివలస, టి.జొన్న వలస, మునగవలస గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగు తుందని ట్రాన్స్‌కో ఈఈ పైడి యోగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్డీఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్లు మార్చడం తదితర పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

## పారిశ్రామిక అభివృద్ధితో ప్రగతి


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే, పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కళాశాలలో మళ్లీ సైన్స్ గ్రూపుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమ కావాలని సీఎంని కోరానని, థర్మల్ పవర్ ప్లాంట్ మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. అయితే కొందరు అవగాహన లేక తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పవర్ ప్లాంట్ వల్ల దానికి అనుబంధంగా సిమెంట్ తదితర పరిశ్రమలు ఏర్పాటై పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.ఎన్ స్వామి, మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ తమ్మినేని గీతా సాగర్, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, పీఏసీఎస్ అధ్యక్షురాలు సిమ్మ మాధవి, ఎన్‌టీఆర్ వర్శిటీ డైరెక్టర్ చాపర సుధాకర్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టీడీపీ నేతలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రైల్వే సమస్యలను పరిష్కరిస్తాం


రైల్వే జీఎంకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం, జాడుపూడి, బారువ, సోంపేట, మందస, పలాస రైల్వే స్టేషన్‌లలో ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని రైల్వే జీఎం పరమేష్ పంక్వజ్ హామీ ఇచ్చినట్లు జడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస్ రౌలో తెలిపారు. శుక్రవారం ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జడ్‌ఆర్‌యూసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లలో ప్రధాన రైళ్ల హాల్టింగ్, ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు, లిఫ్టులు, ర్యాంపులు, వెయిటింగ్ షెడ్ల నిర్మాణాలపై వినతిపత్రాలు అందించారు. చర్యలు తీసుకుంటామని జీఎం హామీ ఇచ్చారు.

### బారువలో పాసింజర్ హాల్ట్ ఇవ్వాలి

సోంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బారువ రైల్వే స్టేషన్‌లో పాసింజర్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు భువనేశ్వర్‌లో జరిగిన సమావేశంలో రైల్వే జనరల్ మేనేజర్‌కు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి వినతిపత్రం అందించారు. జీఎంను కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు మడ్డు కుమార్, రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, రైల్వే సాధన కమిటీ సభ్యుడు రత్నాల శ్రీనివాసరావు ఉన్నారు.

## మా డబ్బులెప్పుడిస్తారు?

- తపాలా శాఖాధికారులను నిలదీసిన ఖాతాదారులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయంలో రూ.కోట్లలో జరిగిన భారీ స్కాం నేపథ్యంలో పలువురు ఖాతాదారులు మా డబ్బులు ఎప్పుడిస్తారని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌ను నిలదీశారు. మా డబ్బులు ఎప్పుడిస్తారో చెప్పండి లేదంటే కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడతామని ఖాతాదారులు చాట్ల లోహిదాస్‌రెడ్డి, ఇసురు బాలరాజు తదితరులు హెచ్చరించారు. నెలరోజుల్లోగా చెల్లిస్తామని చెప్పారని, అయితే ఇంతవరకు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే అందరి గ్రీవెన్స్ స్వీకరించామని, అన్ని రిపో ర్టులు తయారు చేశామన్నారు. మరో 6 నెలల్లో మీ సమ స్యలు పరిష్కారం అవుతాయని, ఆందోళన చెందవద్దని పేర్కొనడంతో వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్‌కు ఫోన్ చేస్తే నెల రోజుల్లో చెల్లిస్తామని చెప్పారని, మీరు ఆరు నెలలంటున్నారని.. ఏది నిజమని ప్రశ్నించారు. రెండు రోజుల్లో సరైన సమాధానం చెప్పకుంటే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

## ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి


ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

రణస్థలం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పో యారని, తక్షణం ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆటో, క్యాబ్ డ్రైవర్లు రామతీర్థం జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం ర్యాలీ చేపట్టారు. ఏడాదికి రూ.25 వేలు భృతి ఇవ్వాలని నినాదాలు చేశారు. ఉచిత బస్సు పథకం వల్ల మా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.శివ, వెలమల రమణ, ఎస్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వామిత్వ సర్వే సకాలంలో పూర్తిచేయాలి

ఎచ్చెర్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆస్తుల వివరాల నమోదుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న స్వామిత్వ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని డీపీవో భారతీ సౌజన్య ఆదేశించారు. బొంతలకోడూరులో నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు వారసత్వంగా వచ్చిన ఆస్తులు, ఇళ్లకు ఇంటి పన్ను మినహా ఎలాంటి హక్కు పత్రాలు లేక తగాదాలు పెరిగిపోతున్నాయన్నారు. జిల్లాలో 912 గ్రామ పంచాయతీల్లోని 3,387 గ్రామాల్లో ఈ సర్వే చేస్తున్నట్టు చెప్పారు. తొలి విడతలో 191 రెవెన్యూ గ్రామాల్లో ఈ సర్వే పూర్తిచేయగా, రెండో విడతలో 500 గ్రామాల్లో సర్వే కొనసాగుతోందన్నారు. సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నరకం ఎన్నాళ్లు..?

- వర్షంపడితే వీధుల్లోనే మురుగు
- చింతాడలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం చింతాడ గ్రా మంలో కాలువ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఏమాత్రం వర్షం కురిసినా వర్షపు నీటితో పాటు మురుగు రోడ్లపై రోజుల తరబడి నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామంలోని మజానగరం వీధిలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. కళింగపట్నం-చింతాడ రోడ్డును నిర్మించి ఇరువైపులా కాలువలను ఏర్పాటు చేయలేదు. పైగా ఈ రోడ్డులోని వీధుల కంటే ఎత్తుగా ఉంది. దీంతో మోకాళ్ల లోతులో నీరు నిలిచిపోతోంది. శుక్రవారం స్థానిక యువకులు సొంతంగా మురుగును తొలగించారు. ఈ గ్రామం ఒక పక్క శ్రీకాకుళం రూరల్ మండలం, మరో పక్క ఆమదాలవలస మునిసిపాలిటి పరిధిలోని ఉండడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పరిస్థితి ఇలాగే ఉంటోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


వీధిలో మురుగును తొలగిస్తున్న దృశ్యం


మజానగరం వీధిలో నిలిచిన మురుగునీరు

## న్యూస్ బాక్స్

### 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్

గార, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణా సంస్థలో (డైట్) సెప్టెంబరు 11, 12 తేదీల్లో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో రవిబాబు తెలిపారు. ఈ మేరకు సంబంధిత ఉత్సవ్ పోస్టర్లను శుక్రవారం డైట్ ప్రిన్సిపాల్ ఎ.గౌరీ శంకరరావు, డీవైఈవో విజయకుమారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే ఈ ఉత్సవ్ లక్ష్యమన్నారు. జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నామన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు తాడేల వెంకట రావు, సీహెచ్.రమణ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ యోగా పోటీలకు శ్రీకాంత్

ఇచ్ఛాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆంధ్రప్రదేశ్ యోగా కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన శ్రీకాంత్ మహంతి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని కోచ్ ఎం. రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు నాగపూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లాడన్నారు.

### రైతులకు సరిపడా యూరియా అందించాలి

కంచిలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలంలో రైతులకు సరిపడా యూరి యాను అందజేయాలని మండల టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. పంటల సాగులో ఎరువులు అవసరం అధికంగా ఉన్నందున రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

### బీఎల్‌ఏల జాబితాను అందించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయ పార్టీలు వారి బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ) జాబితాను సమర్పించాలని ఆర్డీవో సాయి ప్రత్యూష కోరారు. శుక్రవారం తన చాంబర్‌లో వివిధ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. సమా వేశంలో తహసీల్దారు ఎస్.గణపతిరావు, డీటీ జీకే శ్రీనివాసరావు టీడీపీ నేత మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి


మనోజ్(ఫైల్)


ఎచ్చెర్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చిలకపాలెం పంచాయతీ మునిపేటకి చెందిన కుప్పిలి మనోజ్ (12) అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతిలో చదువుతున్నాడు. సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు రోజూ కాలినడకన లేదా ఏదో ఒక వాహనాన్ని ఆశ్రయిస్తుంటాడు. ఇదే క్రమంలో శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు చిలకపాలెం జంక్షన్‌లో వేచి ఉండగా, అదే పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు వెళ్తున్న ఆటోలో తోటి విద్యార్థులు మరో నలుగురితో కలిసి ఎక్కాడు. కొద్ది దూరం వెళ్లే సరికి ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో బేబీ సీటులో కూర్చొన్న మనోజ్ రోడ్డుపైకి తుళ్లిపోయి పడిపోగా, ఆటో ఆ విద్యార్థిపై బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో విద్యార్థిని కె.తనుశ్రీ (9వ తరగతి) గాయపడి శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతోంది. మృతుడి తండ్రి ప్రకాష్ కార్పెంటర్ కాగా, తల్లి సరస్వతి గృహిణి. ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## జింకిభద్ర పాఠశాల హెచ్ఎం..


చింతామణి(ఫైల్)

సోంపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జింకిభద్ర పాఠశాల హెచ్ఎం చింతామణి దేవి పాడి(53) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బారువ గ్రామానికి చెందిన చింతామణి ఇటీవల పదోన్నతి పొంది జింకిభద్ర పాఠశాలలో హెచ్ఎంగా చేరారు. ప్రతిరోజూ స్వగ్రామం నుంచి పాఠశాలకు వెళుతుంటారు. ఎప్పటిలాగే శుక్రవారం కూడా పాఠశాలకు బస్సులో వెళుతున్నారు. అయితే జింకిభద్రలో బస్సు దిగుతూ కింద పడిపోయారు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆమెను సోంపేట ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలిస్తుంగా మార్గమధ్యలో మృతిచెందారు. సోంపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈమె అవివాహితురాలు. మృతురాలికి తండ్రి, ఇద్దరు సోదరీలు, ఒక సోదరుడు ఉన్నారు.

## చెరువులో పడి వ్యక్తి..


రామన్న మృతదేహం

టెక్కలి/రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పెద్దరోకళ్లపల్లి పంచాయతీ రామనగరం గ్రామానికి చెందిన బి.రామన్న(37) అనే వ్యక్తి శుక్రవారం గ్రామంలోని చెరువులో జారిపడి మృతిచెందాడు. గ్రామ స్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు చెరువులోకి దిగే క్రమంలో రామన్న ప్రమాదవశాత్తు జారిపోవడంతో మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అందించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు. రామన్నకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## గంజాయి స్మగ్లర్లకు పదేళ్ల జైలు

● రూ.లక్ష జరిమానా

పలాస, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్లు శంకరన్ మిశ్రా, సరోజ్‌కుమార్ సాహులకు పదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా శ్రీకాకుళం కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు విధించినట్టు రైల్వే ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... 2024 సంవత్సరంలో వీరిద్దరూ 42 కిలోల గంజాయితో రైలులో ప్రయాణించేందుకు యత్నిస్తుండగా అప్పటి ఎస్‌ఐ షేక్‌షరీఫ్, సీఐ కె.వెంకటరావు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి శ్రీకాకుళం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా.. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయాధికారి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది కింజరాపు శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

## వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు చోరీ


లబోదిబోమంటున్న బాధితురాలు గడ్డెమ్మ

పోలాకి ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి గ్రామానికి చెందిన మెండ గడ్డెమ్మ అనే వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు పోయిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ శ్మశాన వాటిక వద్ద గల కాలువలో గడ్డెమ్మ బకెట్‌ను శుభ్రం చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఒకరు బండిపై ఉండి.. మరొకరు ఆమె వద్దకు వెళ్లి మెడలో ఉన్న పుస్తెలతాడును దొంగలించుకుపోయారు. ఆమె కేకలు వేయడంతో సమీపంలో ఉన్న కొంత మంది యువకులు వారు వెళ్లి వైపు ద్విచక్ర వాహనాలపై వెళ్లినా వారి జాడ కనిపించలేదు. విషయాన్ని గ్రామస్థులకు చెప్పగా.. మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు పోలీసులకు సమాచారం అందించారు. నరసన్నపేట సీఐ జె.శ్రీపోతుల శ్రీనివాసరావు, ఎస్‌ఐ రంజిత్ సిబ్బంది, క్లూస్ టీమ్‌తో చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడి చోరీ జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు.

## ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


పాతపట్నం: రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పాతపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పాతపట్నం, కొరసవాడ గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ డీవీవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవో అధికారి కిరణ్‌వాణి, విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

● మెళియాపుట్టి: మండలంలోని మెళియాపుట్టి, చాపర గ్రామాల్లో మూడు ఎరువుల షాపులను శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ డీవీవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ సిబ్బంది ఏకమొత్తంలో దాడులు చేసి రికార్డులు, నిల్వలు పరిశీలించారు. ఏవో దానకర్ణుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## మా గ్రామం పేరు మార్చండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్థులు

మెళియాపుట్టి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తమ గ్రామం పేరు మార్చాలని కోరుతూ పడ్డ పంచాయతీ సానిపాలెం గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ బి.పాపరావును కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామం పూర్వం నుంచి సానిపాలెం గ్రామంగా పిలుస్తున్నారని, దీన్ని చెప్పుకోవడానికి ఇబ్బందిగా ఉందని, అందువల్ల రామయ్యపాలెం గ్రామంగా పేరు మార్పు చేయాలని వారు కోరారు. ప్రభుత్వం సరిహద్దులు మార్పునకు మంత్రివర్గ ఉప సంఘంతోపాటు కమిటీలు వేసిందని, ఇదే సమయంలో మా గ్రామం పేరు మార్పు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


జి.సిగడాం: సంప్రదాయ వస్త్రధారణలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు


టెక్కలి రూరల్: అష్టదిగ్గజ కవుల వేషధారణలో బూరగాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు


కాశీబుగ్గ: చినబాడం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన


కంచిలి: మఖరాంపురం పాఠశాలలో తెలుగుతల్లి వేషధారణలో చిన్నారి

తెలుగు భాషా దినోత్సవం శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషా పితామహుడు గిడుగు రామమూర్తి విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ ప్రదర్శనలు, సంప్రదాయ వస్త్రధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.
- ఆంధ్రజ్యోతి బృందం


పోలాకి: కోడూరు ఉన్నత పాఠశాలలో..


సరుబుజ్జిలి: గిడుగు రామ్మూర్తి స్వగ్రామం పర్వతాలపేటలో..


ఎచ్చెర్ల: అంబేద్కర్ వర్సిటీలో వీసీ కేఆర్ రజని తదితరులు..


వజ్రపుకొత్తూరు: హుకుంపేట పాఠశాలలో..


శ్రీకాకుళం కల్చరల్: శాంతినగర్ కాలనీలో గల గాంధీ మందిరంలో..


గుజరాతీపేట: అరసవల్లిలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో..

## గత పాలకుల వైఫల్యమే ప్రజలకు కష్టాలు

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, కక్ష పూరిత రాజకీయాలతో ప్రజా ప్రతినిధులు కాలం గడపడం వల్లే నేడు ప్రజలకు కష్టాలు ఎక్కువయ్యాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. అలాగే విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ, ఏఈలు పాల్గొన్నారు. అలాగే తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి చిత్ర పటానికి మంత్రి అచ్చెన్నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడే భాష, రాసే భాష ఒక్కటే కావాలని తపించి ఆ దిశగా ఉద్యమాన్ని నడిపిన గొప్పవ్యక్తి గిడుగు రామమూర్తి అని కొనియాడారు. అలాగే పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దమోదర నరసింహ, తదితరులు మంత్రిని మార్యద పూర్వకంగా కలుసుకున్నారు.

## సకాలంలో ఫిర్యాదులు పరిష్కరించండి


వినతిని పరిశీలిస్తున్న ఎస్పీ

పలాస, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణం విచారించి పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ స్వీకరించే ఆర్జీలను పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. పలాస, టెక్కలి డివిజన్‌ల పరిధిలో ఫిర్యాదుదారుల సౌకర్యం కోసం కాశీబుగ్గలో ప్రతి శుక్రవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, దీన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో హౌస్ అధికారులతో మాట్లాడారు. కేసుల పెండింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో డీఎస్పీ వి.వెంకట అప్పారావు, సీఐలు పి.సూర్యనారాయణ, తిరుపతిరావుతో పాటు డివిజన్‌లో ఉన్న సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి


ఉపాధ్యాయులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

ఎల్ఎన్ పేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కొమ్ము వలస గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యుత్ వైర్లు, నీటి సరఫరా పైపు లైను, కిటికీలు, తలుపులు ధ్వంసం చేయడమే కా కుండా పాఠశాల ప్రాంగ ణంలోని నాటిన మొక్కలను పీకివేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పాఠశాల కమిటీ చైర్మన్ ఆర్.చలపతిరావుతోపాటు గ్రామస్థులు శుక్రవారం సరు బుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శుక్రవారం ఆ గ్రామా న్ని సందర్శించి ఘటన జరిగిన తీరును తెలుసుకున్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి చొరబడి ధ్వంసం చేశారన్నారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## నూతన పరిశోధనలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీన్ బట్టాచార్య

టెక్కలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నూతన పరిశోధనలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో పరిశోధనల అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలపై నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. కొత్త ప్రాజెక్టులపై ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డీన్ బట్టాచార్య, డాక్టర్ శ్రీరాములు ఉన్నారు.

## మెరుగైన సేవలందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ అర్జునరావు

జలుమూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తమ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఏపీ గ్రామీణా బ్యాంక్ పార్వతీపురం రీజనల్ మేనేజర్ కె.అర్జునరావు అన్నారు. జలుమూరులో గల ఏపీ గ్రామీణ బ్యాంకును నూతన భవనంలోకి మార్పు చేసి శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు జిల్లాల్లో బ్యాంకు సేవలందించే గ్రామీణ బ్యాంకు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా రాష్ట్రమంతటా సేవలు విస్తరింపజేసిందన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో మరో 50 నూతన బ్రాంచీలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు గంటా అప్పలనాయుడు, జలుమూరు, బుడితి, సారవకోట బ్యాంకు మేనేజర్లు,ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## స్మారక సభను విజయవంతం చేయండి

పలాసరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల కోసం నిరంతరం పోరాడిన కామ్రేడ్ కుమారన్న, ఉద్యమ సహచరుడు సీతారాముల స్మారక సభ వచ్చే నెల 10వతేదీన లొత్తూరులో నిర్వహించనున్నట్లు, ఈ సభను విజయవంతం చేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు కోరారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో శుక్రవారం స్మారక సభ పోస్టరును విడుదల చేశారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, అరుణోదయ రాష్ట్రప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాసంఘాల నాయకులు గొరకల బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి, జానకమ్మ, గీత, తాతారావు, గోపి, కుసుమ, లక్ష్మణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల తీరుపై సభ్యుల వాకౌట్

పలాస, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డీసెంట్ ఇచ్చిన అంశం మొదటి చర్చనీయాంశంగా పెట్టాల్సి ఉండగా దీన్ని ఎందుకు అజెండాలో పెట్టలేదని, అధికారుల తీరుకు నిరసనగా వైసీపీ సభ్యులు మునిసిపల్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం కమిషనర్ ఎన్.రామారావు చాంబర్ వద్ద బైఠాయించి కోరం లేకుండా ఎందుకు సమావేశాన్ని నిర్వహించారంటూ ప్రశ్నించారు. అయితే అప్పటికే టీడీపీ, వైసీపీ సభ్యులు కోరం మేరకు సంతకాలు పెట్టి వెళ్లిపోయిన విషయం తెలుసుకొని వారంతా వెనుదిరిగారు. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మునిసపల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి నిర్వహించారు. టీడీపీ సభ్యులు ఆరుగురు రాగా, వైసీపీ సభ్యులు చైర్మన్‌తో సహా 11 మంది సభకు చేరుకున్నారు. అనంతరం సభ ప్రారంభం కాగానే వైసీపీ విప్ దుర్గాశంకర్ పండా మాట్లాడుతూ.. గత సమావేశంలో తాము డీసెంట్ నోట్ ఇచ్చామని, దీనికి ఎటువంటి సమాధానం ఇవ్వలేదని, ప్రస్తుత సమావేశంలో తాము ఇచ్చిన డీసెంట్ అంశాలు తొలుత ప్రాధాన్యం అంశంగా చేర్పించాల్సి ఉండగా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ ఎన్.రామారావు సమాధానం ఇస్తూ డీసెంట్ వివరాలు కలెక్టర్‌కు నివేదించామని, వారం రోజుల్లో సభ్యులకు సమాధానం ఇస్తామన్నారు. చైర్మన్ బళ్ల గిరిబాబు మాట్లాడుతు మినిట్ పుస్తకంలో వాటి వివరాలు పొందుపరిచామని, నిబంధనల మేరకు వాటి వివరాలు 24 గంటల్లోగా నోటీసు బోర్డులో పెడతామని స్పష్టం చేశారు. దీనిపై సంతృప్తి చెందని వైసీపీ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం సభలో అజెండాల వారిగా సమీక్ష నిర్వహించి ఆమోదించారు.

## విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని 108 పలాస డివిజనల్ అధికారి కె.చిన్నబాబు అన్నారు. స్థానిక సామాజిక ఆసుపత్రి వద్ద 108 అంబులెన్స్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న మందులు, వాటి వివరాలను పరిశీలించారు. టెక్నీషియన్ కె.ఆఫీస్, పైలట్ డి.రాంబాబుకి పలు సూచనలు ఇచ్చారు.

## సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోండి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రిచర్డ్‌బూన్

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రిచర్డ్‌భూన్ అన్నారు. శుక్రవారం చినవంకలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేశారు. చిన్న సమస్య ఉన్నా అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా బీపీ, మధుమేహం వ్యాధులతో బాధపడేవారు మందులను క్రమం తప్పకుండా వేసుకోవాలన్నారు. అలాగే కిడ్నీ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.చక్రధర్, టి.లక్ష్మీదేవి, పీహెచ్ఎన్ పి.రూపాలక్ష్మి, ఎంఐహెచ్‌పీఎస్‌లు ఎస్.జ్యోతి, ఎన్.శ్రావణిసంధ్య, సీహెచ్ సోమేశ్వరరావు, ఎస్.రమణ ఉన్నారు.

## నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ ప్రైవేట్ ఐటీఐలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ తెలిపారు. ఈ న్యాయవిజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల హాజరవుతారని తెలిపారు.

## క్రికెట్ జట్టుకు సుశాంత్ ఎంపిక


సుశాంత్

టెక్కలి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరు నుంచి గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరగనున్న రిలయన్స్ క్రికెట్ కప్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టులో టెక్కలికి చెందిన నంబాళ్ల సుశాంత్‌కు అవకాశం లభించింది. ఇప్పటికే సుశాంత్ అండర్-19లో రాణించడంతో ఈ జట్టులో ఎంపికయ్యాడు. సుశాంత్ తండ్రి డాక్టర్ నంబాళ్ల జగదీష్ శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్యులుగా పనిచేస్తున్నారు. సుశాంత్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరానికి చెందిన వడ్డి శ్యాంసుందర్‌పై రెండో పట్టణ పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చంపాగల్లి వీధికి చెందిన వడ్డి శ్యాంసుందర్ కొన్నేళ్లుగా దీపామహల్ సమీపంలోని పెట్రోలు బంకు పక్కన మొబైల్ రిపేర్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. విజయవాడకు చెందిన 17ఏళ్ల బాలిక నగరంలోని ఓ ప్రాంతంలో నివసిస్తున్న అమ్మమ్మ ఇంటికి మార్చిలో వచ్చింది. ఈ నేపథ్యంలో శ్యాంసుందర్ ఆ బాలికతో పరిచయం ఏర్పరచుకునిని దగ్గరయ్యాడు. బాలిక గర్భం దాల్చడంతో విషయం తల్లితండ్రులకు తెలిసింది. వారు శ్రీకాకుళం వచ్చి శ్యాంసుందర్‌ను నిలదీశారు. తల్లి ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం టూటౌన్ సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నేడు ప్రజా ప్రతినిధులకు శిక్షణ

టెక్కలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10గంటలకు ఎంపీటీసీలతో పాటు సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, కార్యదర్శులకు ఎడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌కు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో కె.ఫణీంద్ర తెలిపారు. విధిగా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

● కొత్తూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరగనున్న పీఏఐ 2.0 పై జరగనున్న శిక్షణకు సచివాలయ సిబ్బంది విధిగా హాజరు కావాలని ఎంపీడీవో వి.నీరజ కోరారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ఆహ్వానాలు అందించినట్టు తెలిపారు. సిబ్బంది దుమ్మా కొడితే శాఖా పరమైన చర్యలకు తప్పవని హెచ్చరించారు.

● పోలాకి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పంచాయతీ పురోగతిపై ప్రత్యేక శిక్షణా నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో బలగ ప్రకాష్ తెలిపారు. శిక్షణకు పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

## రైల్వే కార్మికులకు అవగాహన

పలాస, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఖుర్దారోడ్ డివిజన్‌లో ఉన్న అన్నీ రైల్వే స్టేషన్‌ల్లోను పనిచేస్తున్న మహిళా కార్మికులకు లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పనిచేస్తున్న ప్రదేశాల్లో మహిళలకు లైంగిక వేధింపులకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విశాఖ పర్సనల్ మేనేజర్, నోడల్ అధికారిణి తపస్విని మహానందియా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ప్రతి ఉద్యోగిని బాధ్యతగా పనిచేయాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా తమకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

## డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

పాతపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పాతపట్నం పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో వివిధ షాపుల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. నిషేధిత పదార్థాలపై విస్తృత తనిఖీలు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌వద్ద గల అంతరరాష్ట్ర చెక్‌పోస్టు మొదలుకొని పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాల్లో తనిఖీలు చేశారు.

● మెళియాపుట్టి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చాపర, వసుందర, జాడుపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి నార్కోటిక్ డాగ్‌తో విస్తృతంగా తనిఖీలు చేసినట్టు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. గంజాయితో పాటు మత్తుపదార్థాల నిల్వలపై తనిఖీలు చేశామన్నారు.

## ఉచిత విద్యుత్ హర్షణీయం

కొత్తూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రులకు గణేష్ మండపాలకు కూటమి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సదుపాయం కల్పించడం హర్షణీయమని హిందూ ధార్మిక సంఘ ప్రతినిధులు పొగిరి రవి, చోడవరపు రామానుంజయులు, లోతుగెడ్డ భగవాన్‌దాస్‌నాయుడు తెలిపారు.

## సందడిగా దీపారాధన

వినాయక ఉత్సవాలు పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జలుమూరు మండలం తిమడాం గ్రామంలో శుక్రవారం రాత్రి దీపారాధన కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని వివిధ రూపాల్లో దీపాలను అలంకరించి వెలిగించారు.
- ఆంధ్రజ్యోతి బృందం


ఎచ్చెర్ల పోలీసు క్వార్టర్స్ వద్ద..


శ్రీకాకుళంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో సినీనటుడు రామ్‌చరణ్ స్టైల్‌లో..


జలుమూరు మండలం తిమడాం గ్రామంలో దీపారాధన